ద్విపద

పెళ్ళినాటికి కుఱ్ఱవాడు చూడబోతే అన్నిందాలా మాంచి నదరుగా ఉన్నాడు. పెళ్ళిపీటలమీద సరసను కూర్చుంటే పిల్లా పిల్లవాడూ, చిలకా గోరింకా మల్లే కను ముద్దుగా ఉన్నారు: కాని, - పానుపు వేసినప్పుడు...ప్రపంచం తలక్రిందులైంది: తెల్లవార్లూ పెళ్లికొడుకు బెల్లంకొట్టిన రాయి!-

-సిసలుగా -అంతే!-

ఈ మగత, పిల్లది యీడేరినప్పుడు. సంబరాల్లోనే పిల్ల తరుపువారు, చూచాయగా పొడగట్టారు: ఆ మూడు రోజులూ, రోజుకోరకం పూలమంటపం కట్టించి, పిల్లదానికి, రోజుకోరకం వేషంవేసి, -ఊరు నాడూ ఏకమై ఉత్సవం చేస్తే - వచ్చిన పెళ్ళికొడుకు, -ఏరోజు కారోజు రెపరెపలాడి పోవడానికి బదులు-బెదిరినట్లు, -చిరాకుపడ్డట్టు, పరధ్యానంగా ఉన్నట్టు...సావాసంకొద్దీ...పిల్లదాని అన్నగారు...వెంటనే కనిపెట్టేశాడు: కాని...పరాచకమాడితే, బయటపడక పోతాడా అనుకుని-

"ఏం బావా! - నా చెల్లెలిని చెప్పుకోవడంకాదు కాని - పిల్ల - అధిక - చక్కందయ్యా!"అని కదలేశాడు: పెళ్ళికొడుకు మొగం తిప్పేసుకున్నాడు: బావమరిది, మళ్ళీ అందుకుని-

"-ఏదో, మా చేతనైన వేషాలు మేం వేయించాము: నీ చేతుల్లో పడ్డాక ఎల్లా తయారుచేస్తావో - సినిమాపత్రికల్లో బొమ్మలు చూచుకొనే శృంగార పురుషుడివి" ఇలా కవ్వించాడు: పెళ్ళికొడుకు గండుచీమ కుట్టినట్టు మౌనంగా విలవిల్లాడాడు:

-పేరంటానికివచ్చిన పడుచులూ, పిలువని పేరంటానికి తొంగిచూసిన ఉడుకు మోతులూ-అలా కళ్ళప్పగించి పిల్లదాన్ని చూశారే!-ఈ వీరుడు పిల్లది ఎక్కడ కళ్ళబడుతుందో అని, ఉన్న నాలుగునాళ్ళూ తప్పించుకు తిరిగాడేం!-

"బిడియమేమో!" అనుకుంది పిల్ల తల్లి.

"కొందరి తత్త్వమే అంతేమో!" అనుకున్నాడు - తండ్రి! నవ్వులాటకు ఆ ప్రమేయంవచ్చినా, - పెళ్ళికూతురికి ఉక్రోషం వచ్చి పారిపోయింది:

సరే! ఆ రోజుల్లో అయిందేదో అయిపోయింది! కాని - తీరా, యిప్పుడిదేమి?-

మరునాడు ఉదయం-పిల్లదాన్ని తడవిచూసిన ముసలమ్మలు, రవంత మూతి విరుచుకున్నారు: మరోనాడు, - ఇదేమా అని ఆలోచనలో పడ్డారు: ఇక మూడోనిద్రకూడా అయిపోయిన తరువాత, - "అయ్యో రాతా!" అని ముక్కుమీద వేలేసుకున్నారు: పిల్లవాడుచూడబోతే పోతబొమ్మల్లే ఉన్నాడే! - అబ్బ వంక, - అమ్మవంక ఎటుచూసినా, ఆ రెండు వంగసాల్లో ఏవక్కరికి, యిలాటి అవకరం లేదే - ఇతగాడి కైనా ఇలాటి వంకరఉందని, - గిట్టనివాళ్లైనా అనకపోయిరే,

–ఈడూ–జోడు పిల్లలందరూ – గంతకుతగిన బొంతతో, నిక్షేపంగా కాపరాలు చేసుకుంటూవుండిరే – ఈ చిన్నదానికిగీతే ఇలా కావాలా? –

ఇలాటి అచ్చట–సర్వసాధారణంగా, ఇరుగు పొరుగు వారందరికీ, మా చెడ్డముచ్చట – కాని, యింట్లోవాళ్ళతో బాటు, అటూ ఇటూ మెసలే అసెమ్మలూ – ఓసెమ్మలూ, అందరూ ఉసూరుమని పోయినారు:

పిల్ల తల్లి, – ఏడుకొండలవాడికి మొక్కుకున్నంత బిగలాగా, కన్నతండ్రిదగ్గిర మొరబెట్టుకుంది: తండ్రి– యిదితాను ఆలోచించవలసిన విషయం కాదన్నట్టు, కొడుకు మీదికి త్రోసేశాడు; కొడుకు యీ తలవంపు యావత్తూ తనదే అన్నట్టు మండిపడి – ఒక్క బళ్ళో యిన్నేళ్ళూ తనతో బాటు చదువుకున్నవాడు, – చివరకు యిలా పరువు తీసేస్తాడా అని, పట్టుకు తన్నబోయినంత ఉమ్మలికంతో, –బావమరదిని, – బందరు రాదారిమీద బస్సుఊపినట్టు ఊపేశాడు:

"ఎందుకురా కోపం?"

జవాబు – "నా కెందుకురా కోపం–?"

"లేకపోతే–ఇదేమిటి?–"

"ఇదేమిటంటే–ఏమిటి?"

"ఎందుకు చేసుకున్నావ్ –పెళ్ళి?"

"కట్నంకోసం?"

"శోభనపు పెండ్లికొడుకు గూబ ఎగిరిపోయింది: ఆ విసురుకు,–యింట్లో వాళ్ళందరూ, – ఏమిటంటే ఏమిటనుకునే గందరగోళంగా, – "ఏదో మా యిద్దరి సరసం!" అని బావమరిది వెంటనే సర్దిచెప్పాడు: పెళ్ళికొడుకు–అంతకన్న మరేమీ విశేషం లేదన్నట్టు–సుతారంగా, చేతనైనట్టు చిరునవ్వు నవ్వడానికి యత్నించి, అక్కడనుంచి తప్పుకున్నాడు.

మళ్ళీ, – మరోగదిలో, బావమరదు లిద్దరూ తారసిల్లారు: పెళ్ళికొడుకును జర్మన్ యుద్ధఖైదీకిమల్లే నిలవేసి, – బావమరిది మరోవిడత, – మాటలతో గూబ కదలేయడం ప్రారంభించాడు –

"ఒరేయ్ – బావా! – బైబిల్ పాత నిబంధనలో యాకోబు, రెండేడుపధ్నాలుగేళ్ళు, పెళ్ళాంకోసం గొర్రెలు కాచాడు: అప్పటికి యిప్పటికీ ఎంత తేడాఉందో చూశావా! కావాలని కాళ్ళుకడిగి, పిలిచి పిల్లనిస్తే – ఎందుకోయ్ యీ నీలుగు? – రొఖ్ఖం పుచ్చుకోడంవరకేనా నీ ప్రయోజకత్వం?..."

పెళ్ళికొడుకు దేనికీ జవాబు చెప్పలేదు – పిల్లను వెంటతీసుకుని,–స్వగ్రామం వెళ్ళిపోయినాడు:

అక్కడా పిల్లదాని అత్తగారు, – పానుపు వేయించింది: పక్కనిండా మల్లెలు చల్లించింది: పిల్లను ఇనుమిక్కిలిగా ముస్తాబుచేసి, – ముత్తైదువలందరిచేతా పాటలు పాడించింది: వేడుకలన్నీ త్వరగా తెముల్చి, – గదితలుపులూ వేయించింది: రాత్రికి అటుకేసి, పిట్టపోకుండా కట్టుదిట్టం చేసింది:

పెళ్ళికొడుకు–పాయసంలో తనవాటా అప్యాయనంగా ఆరగించాడు: ఆకూ, వక్కా–అందిపుచ్చుకున్నాడు–కాని, – ఆనాటికీ అంతే!–

అంతేనా?–

పదిగంటల ప్రొద్దోయింది: ఇరుగు పొరుగూ, – కొంచెం కుడీ ఎడంగా మాటుమణగింది. పిల్లది, రమారమి గంటసేపటినుంచీ, – కిటికీదగ్గిర అలాగే నిల్చుని ఉంది – ఇక నిలుచోలేకపోయింది: ఆపళానే – అటు ఓరగా చూసింది: పెళ్ళి కొడుకు పుస్తకమల్లే పడుకుని ఉన్నాడు:

చరచర పెళ్ళి జబ్బపట్టుకుని ఊపింది: నిదుర లేపింది: మేలుకున్న మగవాడు ఉలికిపడి లేచికూర్చుని, పిల్లదానివంక చూసి, కన్ను తెరవలేకపోయినాడు: పిల్లది, పానుపుమీద సరసకు జరిగింది:

"నిద్రా?"

"భద్రా?"

"అత్తవారింట చేసిన హామూలు చాలుగాని, – పుట్టింటైనా బుద్ధితెచ్చుకోండి!–"

పెళ్ళికొడుకు కొంచెం కోపంగా కన్ను తెరిచాడు–

"మీకు కోపంవస్తే – నే నూరుకోను:–

నాకు కోపం తెప్పిస్తే–మావాళ్లు ఊరుకోరు–

మౌనంగా ఉంటే యిచ్చిన దేవత లూరుకోరు:

చనువు చేతగాకపోతేమానె–కవ్వించినా చేయిచేసుకోరేం?–

పెళ్ళికొడుకు బుద్ధుడల్లే అలాగే కూర్చున్నాడు:

"పెళ్ళిచూపులకని వచ్చి, – ముక్కూ మొగం ఎరుగని దాన్ని కళ్ళతో పలుకరించారు:

పలువరుస కనబడకుండానే, – మనసుతోనే మనసైందని నాకు తెలిసేట్టు చెప్పారు!

పెళ్ళిలో మనవాళ్ళు తీయించిన ఫోటోలో, – నాకోసం లోకాలన్నీ జయించుకువచ్చే వీరాధివీరుడల్లే నిలుచున్నారు–

తమరు – ఆ పెళ్ళికొడుకేనా"–

పెళ్ళికొడుకు పానుపు దిగివెళ్ళి మరచెంబు ఒంటిచేతి మీద ఎత్తి చెంబెడు నీళ్ళూ గుక్క ఆపకుండా తాగేశాడు. వచ్చిన త్రోవనే ఒక అడుగు వేశాడు:

"ఆగండి!– అక్కడే ఆగండి! రణతిక్కన్న యింట్లో ముగ్గు రాడవారు! యీ గదిలో యిద్ద రాడవారు!"

పెళ్ళికూతురు–అత్తవారు కట్టబెట్టిన ఉప్పాడ చీరె, – ముక్కువగా కుట్టించుకున్న రవిక డుల్చి, – పెళ్ళికొడుకు మీదికి గిరవాటు వేసింది:

"కట్టుకోండి!–"

పెళ్ళికొడుకు, రిప్ – వాన్ – వింకిల్ నిద్రలేచినట్లు – అమాంతం మేలుకున్నాడు!–

కట్టుకోరేం?

–మాట వినిపించుకోకుండా – పిల్లదాన్ని పొదివి పట్టుకున్నాడు:

–ఎంతగా నెంతోసేపటికి – పెళ్ళికూతురు, –ఆదమరచి, –అడిగింది... "ఎందుకలా మారిపోయినారు?–"

"చెపితే నవ్వితే?-"

"నవ్వేందుకు ఓపికలేదు-"

-అందుకు, -యిద్దరూ నవ్వుకున్నారు. ఒకరు చెప్పగా-ఒకరు విన్నారు:

"ఏదో స్టూడియోలో, - రాజాంతఃపురంలో, - ఓ సింగారిని చూశాను: మర్యాదకాదని తెలిసినా పదే పదే పరకాయించి చూశాను: సిసలుగా వీనస్ అంత బందోబస్తుగా ఉంది: ఆవిడబొమ్మే ఏదో పత్రికలో మామూలు ధోరణిలో చూశాను: ఆ పరువూ, బరువూ - ఏ కోశానా లేదు: యింత తేడా ఏలా అని, అష్టకష్టాలు పడి, - ఆవిడ భవనానికి వెళ్ళి దర్శనం చేసుకున్నాను: రామ రామ! - తగుపాళ్ళం పొన్నకాయలాగా ఉండే మా మేనమామ నయం - ఆ అంగనకన్న!-ఇలానే రెండుమూడు ఘట్టిచోట్ల జరిగింది: కళ్ళు మూసుకు నడుస్తూంటే గోడతగిలి నొసలు బొప్పికట్టినట్లయింది:"

"...ఏదో బళ్ళో చదువుకున్నాను, - పరీక్షల్లో నెగ్గుకొచ్చా నన్నమాటేకాని - నిజంగా ఏమీ అభమూ శుభమూ తెలియని రుష్యశృంగుణ్ణంటే ఎవరూ నమ్మరు: కాని, నా పెంపకం అలాటిది! పరాయి ఆడపిల్లవంక పొరబాటునైనా తలయెత్తి చూడనాయెను!"

"అదివరకల్లా కర్ణుడి సహజ కవచకుండలాలల్లే, - ఆడవాళ్ళు కూడా, సల్లక్షణంగా పుట్టినవాళ్ళే అని అనుకుంటూ ఉండేవాణ్ణల్లా, - ఆ చూపులుబాపతు, తేల్చుకున్నదేమంటే - గ్రీకు శిల్పులందరూ - మన కనువర్రకోసం తంటాలుపడి అలాయిదాగా అమర్చిన ఉవ్వెత్తులేతప్ప, - బ్రహ్మదేవుడు, ఆడవారికి ప్రత్యేకం మలచిన వరాలేవీ లేవేమో అని!-"

"కాని, కేవలం అలానూ అనుకునేందుకు వీలులేకుండా - పసితనంలో తల్లియిచ్చిన పాలు గొంతులో కొరమానినవి: కనక, - కలదు కలండనెడివాడు కలడో లేడో అన్నట్టు ఆ తబ్బిబ్బులో పడిపోయినాను:"

"నీ ముస్తాబు చూడగానే - ఆ అనుమానం కన్నా ముందు, కొండంత భయం వేసింది: లేకపోతే - మీ వాళ్ళచేత అన్ని మాటలు పడిఉండేవాణ్ణా!-"

పెళ్ళికూతురు చాలా జాలిపడ్డది-

"ఈమాట అనాడే చెప్పి ఉంటే?-"

"పెళ్ళికొడుకు మగసిరిగా జవాబు అందుకున్నాడు - "

"నీవు ఈ చొరవ అనాడే చేసి ఉంటే!-"

★ ★ ★